క్లుప్తంగా

జాగ్రత్తలతోనే ప్రమాదాల నివారణ



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

కోడుమూరు: చిన్న చిన్న జాగ్రత్తలతోనే అగ్ని ప్రమాదాలను నివారించవచ్చునని కోడుమూరు అగ్నిమాపక కేంద్రం ఎస్‌ఐ మహబూబ్ దౌలత్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక అగ్నిమాపక కేంద్రంలో సిబ్బంది అగ్నిప్రమాద నివారణ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రజల ప్రాణాలు, ఆస్తులను అగ్ని ప్రమాదాల నుంచి కాపాడే సమయాల్లో అమరులైన అగ్నిమాపక సిబ్బందికి గుర్తుగా సంస్మరణ దినోత్సవం, వారోత్సవాలను జరుపుకుంటున్నామన్నారు. వేసవి కాలంలో అగ్నిప్రమాదాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని, ఏవైనా ప్రమాదాలు చోటుచేసుకుంటే అగ్నిమాపక దళ సిబ్బందికి సమాచారమివ్వాలన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి



మాట్లాడుతున్న కేవీ నారాయణ

గూడూరు: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కేవీ నారాయణ అన్నారు. శుక్రవారం స్థానికి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల కమిటీ సభ్యులు, ప్రజా సంఘాల నాయకుల సమావేశంలో కేవీ నారాయణ మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని విస్మరించి, ఏకపక్షంగా పాలన సాగిస్తోందన్నారు. నేటి నుంచి గ్రామాలు, పట్టణాల్లో ఇంటింటికీ తిరుగుతూ మోదీ ప్రజా వ్యతిరేకపై ప్రజలను చైతన్యం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు మోహన్, దానమన్న, రామాంజనేయులు, గుంటప్ప, కొమ్ము రాజుల, సుధాకర్, మద్దమ్మ, సునంద పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

కల్లూరు: మండల పరిధిలోని చెట్లమల్లాపురం, కె.మార్కపురం గ్రామాల్లో ప్రయాణికుల సౌకర్యార్థం చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు సర్పంచులు ఎస్.భూపాల్‌రెడ్డి, గణ మద్దిలేటి శుక్రవారం తెలిపారు. వేసవి కాలంలో ప్రజలు, ప్రయాణికుల దాహార్తి తీర్చడం కోసం చలివేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రాఘవేంద్ర, శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): కర్నూలు నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ కోతలు విధించనున్నట్లు కర్నూలు ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్వహణ, అభివృద్ధి పనులు చేపడుతున్న కారణంగా ఎన్‌ఆర్‌పేట, కొత్త పేట, సాయిబాబా సంజీవయ్య నగర్, లాల్ బహదూర్ శాస్త్రి నగర్, ఎస్.నాగప్ప వీధి, కురువ వీధి, ఖండేరి, పెద్దమార్కెట్, ఖల్లా, వడ్డెగేరి, ఖడక్‌పుర, పాత కంట్రోల్ రూమ్, బాబా బృందావన్ నగర్, ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ ఏరియా, నిర్మల్ నగర్, గురురాఘవేంద్ర నగర్, ఠాగూర్ నగర్, గోపీనగర్, విద్యుత్ ఎంప్లాయీస్ కాలనీ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే సి.క్యాంప్ పరిధిలోని బృందావన్ నగర్, మాధవీ నగర్, ఎలుకూరు ఎస్టేట్, సి.క్యాంప్ ఏరియా మద్దూర్ నగర్, శ్రీరామ్ నగర్, శేషాద్రి నగర్, బీటీఆర్ నగర్, అరుంధతి నగర్, పాతబస్తీ పూర్తి ఏరియాలో 3 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వెల్లడించారు.

16 నుంచి ధరిత్రి వారోత్సవాలు

కర్నూలు కల్చరల్: భారత ప్రభుత్వ పృథ్వీ విజ్ఞాన మంత్రిత్వ శాఖ, నైస్ యూత్ ఫర్ కల్చరల్ అండ్ ఎడ్యుకేషన్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి 22వ తేదీ వరకు ప్రపంచ ధరిత్రి వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నైస్ యూత్ ఫర్ కల్చరల్ అండ్ ఎడ్యుకేషన్ సంస్థ అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. దీనికి సంబంధించిన కరపత్రాలను శుక్రవారం వీఆర్ కాలనీలోని నైస్ సంస్థ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 18న జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీలు, వ్యాస రచన, వక్తృత్వ పోటీలు ఉంటాయన్నారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న వారికి ఈ నెల 21న సన్మానం ఉంటుందన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా చేసిన కార్యక్రమాల వివరాల బయోడేటాను 16 లోగా కార్యాలయంలో అందజేయాలన్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

కర్నూలు(రాజ్‌విహార్): వేసవి ఎండలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ శ్రావణి అన్నారు. శుక్రవారం స్థానిక బళ్లారి చౌరస్తా సమీపంలో ఓమ్ జయః కర్నూలు సేవా సమితి ఆధ్వర్యంలో చల్లని పానీయాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రావణి మాట్లాడుతూ ఎండలతో అప్రమత్తంగా ఉండని పక్షంలో అనారోగ్యానికి గురికావాల్సి వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు అనురాధ, శ్రీదేవి బాయి, బుద్ధిరాజు గౌడ్ పాల్గొన్నారు.



గార్గేయపురంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నినాదాలు చేస్తున్న నాయకులు



గడివేముల ఎంపీడీఓ కార్యాలయంలో..



పాణ్యం ఏపీ గిరిజన గురుకుల పాఠశాలలో..



ఓర్వకల్లులో..

మార్గదర్శకుడు అంబేడ్కర్



కర్నూలు ఎంపీడీఓ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరమ్మ

- జిల్లా కలెక్టర్ సృజన
- వాడవాడలా అంబేడ్కర్ జయంతి వేడుకలు
- పాల్గొన్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



శరీన్ నగర్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సృజన. చిత్రంలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తదితరులు

కల్లూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మార్గదర్శకుడని, ఆయన చూపిన దారిలో ప్రతిఒక్కరూ నడవాలని జిల్లా కలెక్టర్ సృజన సూచించారు. శరీన్ నగరలో అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కాటసాని, ఆర్డీఓ హరిప్రసాద్, తహసీల్దార్ రమేష్‌బాబుతో కలిసి కలెక్టర్ సృజన.. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంచి పెట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజ్యాంగంలో అంబేడ్కర్ చెప్పినట్లు సమాజంలో అందరూ సమానమే అన్నారు. ప్రతిఒక్కరూ తమ హక్కులను సద్వినియోగం చేసుకుంటూ సమాజం పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ అంబేడ్కర్ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి, కుల వివక్ష నిర్మూలకు ఎంతో కృషి చేశారన్నారు. ఆయన చూపిన మార్గంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. అలాగే కల్లూరు అర్బన్ 33వ వార్డులో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లోనూ ఎమ్మెల్యే కాటసాని పాల్గొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుక, కార్పొరేటర్లు శ్వేతారెడ్డి, అరుణ, చిట్టెమ్మ, నరసింహులు, జయరాముడు, డీఎల్ కాంతారెడ్డి, లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- కల్లూరు అర్బన్ 28వ వార్డులో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో విగ్రహదాత శేఖర్ చౌదరి, ఎమ్మార్పీఎస్, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.
- నంద్యాల చెక్‌పోస్టు సమీపంలో దామోదరం సంజీవయ్య భవనంలో కాంగ్రెస్ పార్టీ నంద్యాల పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్ అంబేడ్కర్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.
- **కర్నూలు(న్యూటౌన్):** జెడ్పీలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపీపీ ధర్మవరం వెంకటేశ్వరమ్మ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కర్‌నాయుడు, మాజీ మండల ఉపాధ్యక్షులు వాసు పాల్గొన్నారు. పాతబస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి ప్రజావాణి పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు మాదిగ నడిపి గుండాలు, గార్గేయపురంలోని అంబేడ్కర్ విగ్రహానికి జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రవిశాస్త్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- **పాణ్యం:** స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్ బీ, వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ దస్తగిరి, కో–ఆప్షన్ సభ్యులు జాకీర్ ఉసేన్, సర్పంచ్ మేకల పల్లవి, ఎంఈఓ కోటయ్య, వైఎస్సార్ టీయూసీ జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఏపీ గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ మేరీ సలోమి పూల మాల వేసి నివాళులర్పించారు. ఎస్సీ కాలనీ యూత్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి గజమాల వేసి ఊరేగించారు. ఏబీఎఫ్‌బీ ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో పలువురు నాయకులు పాల్గొన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు గద్దల సామేల్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
- **ఓర్వకల్లు:** మండలంలోని నన్నూరు ఎస్సీ కాలనీలో సీపీఎం మండల కార్యదర్శి నాగన్న ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- **గడివేముల:** స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప పూలమాలలు వేసి నివాళులర్పించారు.



పాణ్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు, అధికారులు

బడుగుల ఆశాజ్యోతి అంబేడ్కర్

- కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య, కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్

కోడుమూరు రూరల్: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, కర్నూలు నగర మేయర్ బీవై. రామయ్య, కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా శుక్రవారం కోడుమూరులోని ఆర్‌టీసీ బస్టాండ్ సర్కిల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి అంబేడ్కర్ ఎనలేని కృషి చేశారన్నారు. అంబేడ్కర్ ఆశయ సాధన దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. అంతకుముందు సర్పంచు భాగ్యరత్న, వైఎస్సార్‌సీపీ స్టేట్ కమిటీ సభ్యులు సంధ్యావిక్రమ్ కుమార్, భారతి సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్ ఎద్దుల మహేశ్వరరెడ్డి, సీఐ శ్రీధర్, ఎస్ఐ శ్రీనివాసులు, ఎమ్మార్పీస్ జిల్లా నాయకులు ఆంధ్రయ్య, వీహెచ్‌పీ, ప్రజా సంఘాల నాయకులు వేర్వేరుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గాడి రూతమ్మ, జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి తదితరులు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

సి బెళగల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈఓఆర్డీ సందీప్, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ పీరయ్య ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ ఆవరణంలో అంబేడ్కర్ విగ్రహానికి సర్పంచ్ పాండురంగన్న పూలమాల వేసి నివాళులర్పించారు. యువకులు అంబేడ్కర్ చిత్రపటాన్ని ఊరేగించారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీ సత్యం యూపీ స్కూల్‌లో శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి సీఐ శ్యామరావు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.





అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మేయర్ బీవై.రామయ్య, ఎమ్మెల్యే సుధాకర్, సి.బెళగల్‌లో ఉచిత వైద్య శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న సీఐ శ్యామరావు

మహిమాన్వితుడు.. తిమ్మగురుడు

- ఘనంగా స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- 19న వసంతోత్సవంతో ముగింపు

గూడూరు: పట్టణంలో వెలసిన తిమ్మగురుడు స్వామి మహిమాన్వితుడిగా వెలుగొందుతున్నాడు. అనంతపురం జిల్లా గుత్తి మండలం రోళ్లపాడు గ్రామానికి చెందిన తిమ్మగురుడు స్వామికి చిన్నప్పటి నుంచే ఆధ్యాత్మిక చింతన ఎక్కువ. ఊరూరా తిరుగుతూ ఎంతో మందికి తన మహిమలు చూపుతూ దాదాపు 110 ఏళ్ల క్రితం గూడూరుకు వచ్చి ఇక్కడే స్థిరపడిపోయారు. ఊరి బయట సత్రంలో నివసిస్తూ దైవం గురించి బోధించే వాడు. ఇక్కడి భక్తులకు ఎన్నో మహిమలు చూపాడు. ఆ కాలంలో తెలంగాణకు చెందిన పెద్దేటి గొల్లల నుంచి తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు స్వామి వారి దృష్టికి తెచ్చారు. పెద్దేటి గొల్లల తాంత్రిక మహిమలకు స్వామి విరుగుడు చూపి స్థానికులకు విముక్తి ప్రసాదించారు. ఆ నాటి నుంచి స్వామికి పూజలు చేయడం మొదలు పెట్టారు. స్వామికి ప్రధాన శిష్యుడు బోడబండ పక్కీరప్ప. అనంతరం స్వామి ఇక్కడే సజీవ సమాధి అయ్యాడు. స్థానికులు స్వామి వారికి గుడి నిర్మించి తిరుణాల చేయడం ప్రారంభించారు. గద్వాల సంస్థానానికి చెందిన మహారాణి లక్ష్మీదేవి రథశాలను నిర్మించారు. జాతరలో ఎక్కువగా వ్యవసాయ పనిముట్లు లభ్యమవుతాయి.



భక్తుల మధ్య సాగుతున్న ప్రభోత్సవం

భక్తిశ్రద్ధలతో ప్రభోత్సవం..

పట్టణంలో వెలసిన తిమ్మగురుడు స్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు శుక్రవారం స్వామి వారికి ప్రభోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 15న ప్రారంభ రథోత్సవం, 16 సంపూర్ణ రథోత్సవం, 17న గరుడోత్సవం, 18న పారు వేట, 19న వసంతోత్సవం ఉంటాయని ఆలయ ఈఓ గురెడ్డి తెలిపారు.



స్వామి వారి మూల విరాట్

16 నుంచి ఆటల పోటీలు

తిరునాలను పురస్కరించుకుని 16వ తేదీ నుంచి చైతన్య యూత్ ఆధ్వర్యంలో పట్టణంలో పరుగు పందెం, సైకిల్ రేస్, సాంస్కృతిక పోటీలు ఉంటాయని నిర్వాహకులు జెడ్పీటీసీ మాజీ మెంబర్ ఎల్.వెంకటేశ్వర్లు తెలిపారు. అలాగే 17న టీడీపీ ఆధ్వర్యంలో కబడ్డీ, 19న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఎద్దుల బండ లాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ముమ్మరంగా స్వచ్ఛత పనులు


- కలెక్టర్ సృజన ఆదేశాలతో కదిలిన అధికారులు
- 'సాక్షి' కథనానికి స్పందన

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా పరిపాలన కేంద్రమైన కలెక్టరేట్‌లో రెండు రోజులుగా పరిశుభ్రత పనులు జోరుగా సాగుతున్నాయి. జిల్లా కలెక్టర్‌గా జి.సృజన బాధ్యతలు చేపట్టిన వెంటనే కలెక్టరేట్ సముదాయంలోని వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాలను సందర్శించారు. ఆయా కార్యాలయాల్లో పారిశుద్ధ్య లోపం స్పష్టంగా కనిపించడంతో కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే పరిశుభ్రతను పెంపొందించాలని, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరిస్తూ ఆదేశాలు ఇచ్చారు. సాక్షి దిన పత్రికలో శుక్రవారం కలెక్టరేట్‌లోని పారిశుద్ధ్య లోపంపై కళ్లకు కట్టినట్లు ఫొటోలతో కథనం ప్రచురితం అయ్యింది. దీంతో స్పందించిన అధికారులు అంబేడ్కర్ జయంతి సందర్భంగా సెలవు రోజు అయినప్పటికీ ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో పరిశుభ్రత పనులు పెద్ద ఎత్తున చేపట్టారు.



డ్వామా కార్యాలయంలో జరుగుతున్న స్వచ్ఛత పనులపై సూచనలు ఇస్తున్న పీడీ అమరనాథరెడ్డి

వైభవంగా విషు మహోత్సవ పూజలు



ప్రత్యేకంగా అలంకరించిన అయ్యప్ప స్వామి పడి



పూజల్లో పాల్గొన్న భక్తులు

కర్నూలు కల్చరల్: అయ్యప్ప స్వామి విషు మహోత్సవ పూజలు వైభవంగా జరిగాయి. శుక్రవారం భాస్కర్ నగర్ అయ్యప్ప స్వామి దేవాలయంలో ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, సాయంత్రం పూలంకి సేవ, పడిపూజ కార్యక్రమాలు నిర్వహించారు. శేష యాదవ్ బ్రదర్స్‌చే నిర్వహించిన భజన అలరించింది. అల్పాహార ప్రసాద వితరణ చేశారు. నిర్వాహకులు రమేష్ గురుస్వామి, మధుసూదనరెడ్డి గురుస్వామి, ఆర్వేటి భాస్కర్, భూషణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

- ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో శ్రీ అయ్యప్ప స్వామి విషు మహోత్సవ పూజలు ఘనంగా జరిగాయి. పడి పూజ, పూలంకి సేవలు విశేషంగా నిర్వహించారు. జయశేఖర్, సోమశేఖర్ గురుస్వాముల బృందంచే నిర్వహించిన అయ్యప్ప భజన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం స్వామి సందేశమిచ్చారు. భక్తులకు అల్పాహార ప్రసాద వితరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే



ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్



ప్రార్థనల్లో పాల్గొన్న ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు(రాజ్‌విహార్): రంజాన్ మాసం సందర్భంగా నగరంలోని 4వ వార్డు గనీగల్లీ జిందాబాయి మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ పాల్గొన్నారు. శుక్రవారం రాత్రి మసీదు పెద్దలతో కలసి దువా చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జుబేర్, పార్టీ నాయకులు రియాజ్ బాబా, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగాకర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి అశోక్‌నగర్‌లోని మదీనా మసీదులో జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. అనంతరం ముస్లిం మతపెద్దలతో ఏర్పాటు చేసిన సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో సలీమ్, సొహైల్, హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

జవాబుదారీగా పనిచేయాలి

వెల్దుర్తి: ఏ చిన్న అవసరానికైనా ప్రజలు పంచాయతీ కార్యాలయానికి, సచివాలయానికి వచ్చినపుడు సంబంధిత అధికారులు జవాబుదారీగా ఉండి వారి సమస్య తీర్చేందుకు బాధ్యతగా పనిచేయాలని డీపీఓ నాగరాజు నాయుడు సూచించారు. శుక్రవారం ఆయన రామళ్లకోట పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభకు డీఎల్‌పీఓ తిమ్మక్కతో కలిసి హాజరయ్యారు. ఎంపీడీఓ శ్రీనివాసరావ్, ఈఓఆర్డీ నరసింహులు, సర్పంచ్ నిర్మల, వైఎస్సార్సీపీ నాయకుడు మాధవస్వామి, రాధాకృష్ణారెడ్డి, బీటీ నాయుడు తదితరులతో కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ గొప్పతనాన్ని వివరించి, సమస్యలపై చర్చించి పరిష్కరించుకునేందుకు గ్రామసభలు నిత్యం నిర్వహించాలన్నారు. గ్రామాలలో అసాంఘిక, దురాచారాలను రూపుమాపే దిశగా ఉద్యోగులు కృషిచేయాలన్నారు. పంచాయతీ సెక్రటరీ వెంకటేశ్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు. వెల్దుర్తి మేజర్ పంచాయతీ ఎంపీడీఓ శ్రీనివాసరావ్, జెడ్పీటీసీ సుంకన్న, సర్పంచ్ ముత్యాల శైలజ పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న డీపీఓ నాగరాజు నాయుడు

భక్తిశ్రద్ధలతో సుగంధ జలాభిషేకం

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజ లు నిర్వహించారు. మొదటి మేష సంక్రమణంను పురస్కరించుకొనిసూర్యనారాయణ స్వామి మూల విరాట్‌కు సుగంధ జలాభిషేకం, విశేష పూజలు, నక్షత్ర హారతి, వేద స్వస్తి తదితర పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివ రామకృష్ణ, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

కళలను ప్రోత్సహించాలి

కర్నూలు కల్చరల్: కళలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని బీజేపీ నేత టీజీ వెంకటేష్ అన్నారు. కందుకూరి వీరేశలింగం పంతులు జయంతిని పురస్కరించుకొని సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో తెలుగు నాటక రంగ దినోత్సవ వేడుకలు, నాటక పోటీలను నిర్వహిస్తున్నారు. పోటీలను ప్రారంభించిన టీజీ మాట్లాడుతూ రెండు రోజుల పాటు పౌరాణిక నాటక పోటీల ను నిర్వహించడం హర్షణీయమన్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ నంద్యాల, కర్నూలు జిల్లాల్లోని మొత్తం 16 నాటక సమాజాలు పోటీల్లో పాల్గొంటున్నాయన్నారు.16వ తేదీ సాయంత్రం 7గంటలకు టీజీవీ కళాక్షేత్రంలో నంది బహుమతులను సాధించిన శ్రీకృష్ణ కర్ణార్జునీయం పద్యనాటక ప్రదర్శన ఉంటుందన్నారు. కార్యక్రమ నిర్వహణ కన్వీనర్లు లక్ష్మీకాంతరావు, రాజారత్నం, కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియ్యా పాల్గొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం

కర్నూలు: అగ్నిమాపక వారోత్సవాలను కర్నూలు అగ్నిమాపక కేంద్రంలో కేంద్ర అధికారి చిన్నబజారి శుక్రవారం ప్రారంభించారు. కర్నూలు ప్రభుత్వ సిల్వర్‌జూబ్లీ కళాశాల ఇంగ్లిష్ అసిస్టెంట్ ప్రొఫెసర్ జయరవిప్రకాష్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అగ్నిమాపక వారోత్సవాల ప్రాధాన్యత, అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ఆ శాఖ సిబ్బంది ప్రమాదాన్ని నివారించేందుకు పడే శ్రమను కొనియాడారు. దేశంలోని వివిధ రాష్ట్రా ల్లో అగ్నిమాపక విధులు నిర్వహిస్తూ మరణించిన సిబ్బందికి నివాళులర్పించారు. కార్యక్రమంలో విప్రో ఫైర్ సేఫ్టీ అధినేత రామాంజనేయులుతో పాటు కర్నూ లు కేంద్ర అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు. 'అగ్నిప్రమాద నివారణ పద్ధతులు–చర్యలు' వివరిస్తూ ముద్రించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు.



అగ్నిమాపక వారోత్సవాల ప్రారంభోత్సవం సందర్భంగా కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రక్తదానం

కర్నూలు(హాస్పిటల్): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక కృష్ణానగర్‌లో తలసీమియా పిల్లల కోసం రక్తదాన శిబిరం ఏ ర్పాటు చేశారు. డేనియల్ రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ భీమ్‌రావ్ యూత్ అసోసియేషన్ వారి సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో దాదాపు 20 మంది యువకులు రక్తదానం చేశారు. వారికి ఫౌండేషన్ ప్రెసిడెంట్ సుమన్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేశారు. రక్తదానం చేసిన వారిని వార్డు కార్పొరేటర్ లక్ష్మీకాంత్‌రెడ్డి అభినందించారు.